క్లుప్తంగా

స్తంభం సమీపంలో వరద నీరు

● ఎర్తింగ్‌తో భయాందోళన



వరద నీటిలో విద్యుత్ స్తంభం

జనగామ : వారం రోజులుగా కురిసిన వర్షాలతో జిల్లా కేంద్రం గుండ్లగడ్డ కాలనీలోని ఓ విద్యుత్ స్తంభం ఎర్తింగ్ వస్తుండడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. స్తంభం వద్ద వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎర్తింగ్ రాకుండా అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పాదచారులు అటు వైపు వెళ్లాలంటే జంకుతున్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్డెక్కితే చర్యలు

రఘునాథపల్లి: ట్రాక్టర్లకు కేజ్‌వీల్స్ వేసుకొని బీటీ రోడ్డు, సీసీ రోడ్డుపై ప్రయాణించి రోడ్లు ధ్వంసం చేస్తే డ్రైవర్, ఓనర్ల పై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్సై దూదిమెట్ల నరేశ్ హెచ్చరించారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేజ్‌వీల్స్‌తో బీటీ, సీసీ రోడ్డుపై ప్రయాణించడంతో రోడ్లు పాడై ప్రజాధనం దుర్వినియోగం అవడమే కాకుండా వాహనదారులకు అసౌకర్యం కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



కొడకండ్ల : మండలంలోని కడగుట్టతండాకు చెందిన భూక్య భిక్షంకు చెందిన పాడి గేదె ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. తండా శివారులో పాడి గేదెను మేత మేపిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ. 80 వేలు ఉంటుందని బాధిత రైతు బోరున విలపిస్తూ తెలిపాడు.

భూ భారతిపై స్పెషల్ డ్రైవ్



ఆదివారం విధుల్లో ఉన్న తహసీల్దార్ రవీందర్, సిబ్బంది

లింగాలఘణపురం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతిపై సెలవు రోజుల్లో కూడా అధికారులు విధులు నిర్వహించి ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలనే ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీంతో మండలంలో ఆదివారం తహసీల్దార్ రవీందర్ తన సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు. భూ భారతిలో జరిగిన గ్రామ సభల్లో 1,522 దరఖాస్తులు రాగా అందులో క్యాటగిరీల వారీగా విభజించి నోటీసులు జారీ చేస్తున్నారు. ఆగస్టు 15 వరకు క్లియర్‌గా ఉన్న ఫైల్స్‌ను పూర్తి చేయాలనే ఆలోచనలతో అధికారులు పనుల్లో నిమగ్నమయారు.

వైఎస్ అభిమానులను గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

బచ్చన్నపేట : తెలంగాణలో వైఎస్సార్ టీపీ పార్టీ పెట్టిన వైఎస్ షర్మిల వైఎస్ అభిమానులను గుర్తించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభిమాని బొడ్డు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ షర్మిల పిలుపు మేరకు తెలంగాణలో వైఎస్ అభిమానులు కాంగ్రెస్ పార్టీకి ఆమోదం తెలిపారని, దీంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో వైఎస్ అభిమానులను గుర్తించి వారికి పలు పదువులను ఇప్పించాలని అన్నారు. ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ అరెస్టులు చేయిస్తూ ఏడాది కాలాన్ని వెళ్లబుచ్చారని అన్నారు. జగన్నను కలిసి మన రాష్ట్ర పరిస్థితులను వివరిస్తానని తెలిపారు.

ఎనిమిది నెలలు.. 942 సేవలు

● 108 వినియోగంపై ప్రజల్లో చైతన్యం
● అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న సిబ్బంది

లింగాలఘణపురం : మండలానికి ఎనిమిది నెలల క్రితం మంజూరైన 108 వాహనంతో ఇప్పటి వరకు 942 అత్యవసర సేవలు అందాయి. గతంలో జనగామ, దేవరుప్పుల మండలాలకు సంబంధించిన 108 వాహనాలు సేవలు అందించేది. 9 డిసెంబర్ 2024లో మండలానికి 108 వాహనం కేటాయించారు. దీంతో అప్పటి నుంచి మండల ప్రజలకు అత్యవసర సేవలు అందుతున్నాయి. మండలంలోని 21 పంచాయతీల్లో ఎప్పుడు ఏ ప్రమాదంతో పాటు ఇతర అత్యవసర వైద్య సేవలైనా అందిస్తున్నారు. ఇద్దరు అనుభవజ్ఞులైన పైలెట్లు ఎం.రమేష్, టీ.నరేష్‌కుమార్, ఇద్దరు మెడికల్ టెక్నీషియన్స్ బిల్లా రాజు, బి.శ్రవణ్‌కుమార్ అందుబాటులో ఉంటూ నిత్యం సేవలు అందిస్తున్నారు. మినీ హాస్పిటల్ మాదిరిగా ఉంటే 108లో రోడ్డు ప్రమాదాలు, భూతగాదాలతో గాయలైన వారిని, పురుగుల మందు, గుండెపోటుకు గురైన, పాము, తేలు కాటు బాధితులను, గర్భిణీలను వెంటనే ఆసుపత్రికి తరలించడమే కాకుండా అందులో ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు.




108 వాహనంలో సేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)

అందుబాటులో ఉండే పరికరాలు

పురుగుల మందు తీసుకున్న వారికి స్టమక్‌వాష్ చేసేందుకు సక్షన్ ఆపరేటర్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే మినీ ఆక్సిజన్ సిలిండర్, డెలివరీ కిట్, షుగర్ టెస్టుకు గ్లూకోమీటర్, జ్వరానికి థర్మామీటర్, నెబ్‌లైజర్ వంటి పరికరాలు అందుబాటులో ఉంటూ అత్యవసర సేవల్లో ప్రాథమిక చికిత్స అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రజల్లో కూడా ఈ వాహన వినియోగంపై అవగాహన పెరిగి అత్యవసర సేవలకు ఎంతగానో వినియోగించుకుంటూ ప్రయోజనం పొందుతున్నారు.

జీపీఎస్ ట్రాకింగ్‌తో సత్వర సేవలు



జిల్లాలో 108 సర్వీసులకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి సత్వర సేవలు అందుబాటులోకి తెచ్చాం. ప్రమాదం జరిగిన చోటుకు ఎక్కడి వాహనం దగ్గరలో ఉంటే ఆ వాహనాన్ని పంపించి సేవలందించడం, వైద్యుల సలహాలు కూడా తీసుకుంటాం. అదేవిధంగా డ్రైవర్లు వాహ నాన్ని దుర్వినియోగం చేయకుండా మానిటరింగ్ ఉంటుంది. 108లో ఇరవై ఏళ్లగా సర్వీసు చేస్తూ సిబ్బందికి ప్రతీ ఆరు నెలలకోసారి రీఫ్రెష్ ట్రైనింగ్ కూడా ఇస్తున్నాం.

– వి.రాము, 108 జిల్లా మేనేజర్

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో బీఆర్ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఇటీవల ప్రమాదవశాత్తు కాలుజారి పడి చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లాను పరామర్శించి ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కన్వీనర్‌గా ఎన్నికైన గణేష్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘన్‌పూర్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం త్వరలో తప్పనిసరిగా ఉప ఎన్నికలు వస్తాయని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సత్తా చాటేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు కనకం గణేష్, తాటికొండ సురేష్, నర్సింహారెడ్డి, ఆగారెడ్డి, గుండె మల్లేష్, ఒగ్గు రాజు, కోల అనీల్, సునీల్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు నాయకుల పరామర్శ

రఘునాథపల్లి : ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స పొంది హైదరాబాద్ మొయినాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శనివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నియోజకవర్గ మహిళా కోఆర్డినేటర్ మడ్లపల్లి సునితరాధాకృష్ణ, జిల్లా నాయకులు కొర్ర రాజేందర్‌నాయక్, వారాల రమేష్, శాగ నాగరాజు, గైని శ్రీనివాస్, జోగు శ్రీకాంత్, మాలోతు హరినాయక్, విజయ, పెద్దగోని రాధ ఉన్నారు.

విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు

స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్‌లో మెడ్‌ప్లస్ సమీపంలోని పాత సినిమా థియేటర్ వద్ద ఇళ్ల మీదుగా 33 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉండి ప్రతీసారి వర్షాకాలంలో పిడుగులు పడిన సమయంలో గృహోపకరణాలు కాలిపోతున్నాయనే విషయమై పలు పత్రికల్లో వార్తలు రావడంతో పాటు బాధితులు విద్యుత్ శాఖ అధికారులకు చేయగా ఫిర్యాదుల మేరకు అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో ఏఈ శంకర్ పర్యవేక్షణలో విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ డీఈ రాంబాబు ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదకరంగా ఇళ్ల మీదుగా దగ్గరగా ఉన్న విద్యుత్‌లైన్‌ను రెండు ఫీట్ల మేర పక్కకు జరిపించామన్నారు. ఇళ్లకు సమీపంగా ఉన్న 33 కేవీ విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించేలా కృషి చేసిన డీఈ రాంబాబు, ఏడీఈ రణధీర్‌రెడ్డి, ఏఈ శంకర్‌తో పాటు విద్యుత్ అధికారులు, సిబ్బందికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, లైన్‌మన్ వాసం శ్రీధర్‌పటేల్, ఏఎల్ఎం నాగరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొడకండ్ల : పార్టీ శ్రేణులంతా త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. ఆదివారం లక్ష్మక్కపల్లిలో నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, రామచంద్రయ్య, భిక్షపతి, రాజేష్‌నాయక్, శ్రీనివాస్, యాకేష్‌యాదవ్, మోహన్, క్రాంతి, ఈదయ్య, వీర్యానాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలకు భవనాలు మంజూరు చేయండి



ఎమ్మెల్యే శ్రీహరితో ఫతేషాపూర్ గ్రామస్తులు

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్‌లో వడ్డెర సంఘానికి, మహిళా సంఘాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గ్రామస్తులు కలిసి విజ్ఞప్తి చేశారు. వడ్డెర కుల, మహిళా సంఘాల నాయకులు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డిలతో కలిసి హనుమకొండలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు, మహిళా సంఘం భవనానికి వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సర్పంచ్‌లు గాజులపాటి మహేందర్, ఎండీ హయత్ అలీ, గొట్టం భాస్కర్‌రెడ్డి, గాజులపాటి వీరోజి, శివరాత్రి వెంకటేష్, కృష్ణ, బాబు, రాజు, సాంబరాజు, గ్రామైక్య సంఘాల వీఓఏలు ఉన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



రఘునాథపల్లి : మండల టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విజయ దుర్గామాతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా దుర్గామాతకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు వై.కుమార్ గౌడ్‌ను సంఘం నాయకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెంతల సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండి రంజాన్, అమృతం, కుమార్, రేసుకుమార్, ఇంతియాజ్, నాసగోని సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నర్మెట: లయన్స్ క్లబ్ జనగామ కింగ్స్, లయన్స్ క్లబ్ జనగామ సూర్య సంయుక్తంగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం అధ్యక్షుడు డాక్టర్ కె.రంజిత్ కుమార్, బోగ రామ్‌దయాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యూరో, స్కిన్, యూరాలజిస్టు, గైనకాలజిస్టు, ఆప్తాల మిస్ట్, డెంటిస్ట్, జనరల్, పిల్లల వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు రంజిత్ కుమార్, విష్ణుశ్రీ, నవీన్, సాయినాథ్ రెడ్డి, శివకుమార్, ఉదయ్ కుమార్‌లు పాల్గొని 278 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ రీజియన్ చైర్మన్ లయన్ చందుపట్ల రవీందర్ రెడ్డి, కోఆర్డినేటర్ లయన్ నాగంపల్లి శ్రీనివాస్, కోశాధికారి లయన్ గాడిపల్లి కిశోర్ కుమార్, ఎఫ్‌డబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయలత తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన విష్ణువర్ధన్



చిల్పూరు : జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన పొగాకుల విష్ణువర్ధన్ ఆదివారం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మొదట ఇటీవల మంద కృష్ణ పద్మశ్రీ పురస్కారం పొందడంతో ఆయనను ఘనంగా సన్మానించారు.

బడుగులకు అండ.. కాంగ్రెస్ జెండా

● డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి



నర్మెట : లబ్ధిదారులతో నాయకులు

నర్మెట: బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ జెండా అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో పలు ఇందిరమ్మ ఇళ్లకు గ్రామశాఖ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్‌తో కలిసి ఆదివారం ముగ్గులు పోసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు పేదలను ఓటు బ్యాంక్‌లానే చూశారని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఆశయాల సాధనకోసం నడుం బిగించిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన కాంగ్రెస్ జండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు వలబోజు శ్రీనివాస్, కన్నెబోయిన రామకృష్ణ, ముక్కెర రాజేష్ యాదవ్, తీగుళ్ల భూపతిరెడ్డి, శివరాత్రి మహేష్, ముద్దం గట్టయ్య, మహేష్, రవీందర్, ప్రజ్ఞాపురం అనిల్ పాల్గొన్నారు.



బచ్చన్నపేట : ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసిన మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బచ్చన్నపేట : రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని అర్హత గల వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొడవటూర్‌లో నీల కవిత ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు మల్లం శ్రీనివాస్, నాయకులు పాకాల చిరంజీవి, నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, నీల రమేష్, కనుకరాజు, నరేష్, శంకరయ్య, రవి, సిద్దులు, అజయ్, ఇర్ఫాన్ పలువురు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



42 ఏళ్ల క్రితం బోధించిన ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980–81లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం గ్రామసమీపంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో గుర్రం రవీందర్‌రెడ్డి, బత్తుల ఎల్లయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నాడు బోధించిన సింగారెడ్డి, రాంరెడ్డి, వీరన్నలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా రాజమహేందర్ రెడ్డి, విజయపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జ్యోతి, విజయ, సంపత్‌రెడ్డి, బోగం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న మోదీ



కూనూర్‌లో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్ : ప్రధానిగా అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ తెలిపారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్, ఉప్పుగల్లు, తిమ్మంపేట, తమ్మడపల్లి (జి), శాపల్లి, జఫర్‌గఢ్ గ్రామాల్లో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుర్ర తిరుపతి, ఎల్లాచారి, కవిత, రాజు, సందీప్, రవి, యాదగిరి, సంతోష్‌రెడ్డి, సురేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మొక్క నాటుతున్న విద్యార్థినులు

తొర్రూరు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ విజయరత్నమాల అన్నారు. ఆదివారం నవయుగ యూత్ వారి ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రతీ వ్యక్తి మొక్కల పెంపకానికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వీరన్ననాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పాలకుర్తి టౌన్ : బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్థికసాయం అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్ : మండలంలోని బమ్మెర గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు దార శంకరయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయుడు బత్తిని దేవయ్యగౌడ్ భుజానికి శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దేవయ్యను దయాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట నాయకులు శ్రీని వాస్‌రావు, రాంబాబు, నాగన్న, గోపి, రాజు ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మేకల రమేశ్ అనారోగ్యంతో ఆస్పత్రి పాలు కాగా ఆ గ్రామ సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ఆర్థిక సాయాన్ని అందించారు. ఆదివారం ఆస్పత్రి వద్ద రమేష్‌ను పరామర్శించి రూ.5వేలను అందజేశారు. ఆయన వెంట రాములు, మహేష్, కేశవులు, సిద్దిరాజు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మావురపు ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబానికి మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ రాములు, కనుకయ్య ఉన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు మోడెం భాస్కర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2002–03 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అతని భార్య భావనకు రూ. 18వేలు ఆర్థికసాయం అందజేశారు.

రెండు కార్లు ఢీకొని పలువురికి గాయాలు

బచ్చన్నపేట : ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని ఆలింపూర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నల్గొండకు చెందిన పాలవరపు గణేష్ కారులో హైదరాబాద్ నుంచి కొమురవెల్లికి వెళ్తున్న క్రమంలో ఆలింపూర్ గ్రామ చివర మలుపు వద్ద ఎదురుగా అతివేగంతో వచ్చిన ఇండికా కారు ఢీకొనడంతో రెండు కార్లు దెబ్బతిన్నాయి. అందులో ఉన్నవారికి గాయాలయ్యాయి. ఘటనా స్థలం వద్దకు పోలీసులు వెళ్లి వారిని పంపించారు.

వరుసగా నాలుగో ప్రమాదం

జనగామ నుంచి దుద్దెడ క్రాస్‌రోడ్డు వరకు ఫోర్‌లేన్ రోడ్లను వేశారు. మరమ్మతు పనుల్లో భాగంగా ఆలింపూర్ గ్రామ మసీదు వద్ద ఉన్న మలుపు దగ్గరకు వాహనాలు వచ్చే వరకు కనిపించకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఇది నాలుగో ప్రమాదం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామంలోని అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని రోడ్ల ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు సమాజానికి ఆదర్శం

● టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: లయన్స్‌క్లబ్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేపట్టారు. లయన్ తంగెళ్లపల్లి మల్లికార్జున్ చారి అధ్యక్షుడిగా, రాపోలు శ్రీనివాస్ కార్యదర్శిగా ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త సభ్యులు కూడా పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఝాన్సీరెడ్డి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, సుధాకర్ రెడ్డి, లక్ష్మినర్సింహరావు, ఏదునూరి శ్రీను, రేణుక, శారద, వెంకన్న, సరేష్, ముత్తినేని శ్రీనివాస్, ఎర్ర వెంకన్న, అనపురం రవి, సోమన్న, సుభాష్, ఉషయ్య, తదితరులు పాల్గొన్నారు.